సాక్షి
సూర్యాపేట
మంగళవారం : 5 : సెప్టెంబర్ : 2023



రాములు మృతి తీరని లోటు

బీజేపీ నేత ఓరుగంటి రాములు మృతి పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. - 8లో



బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు


వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని హుజూరాబాద్ ఎమ్మెల్యే రాజేందర్ హెచ్చరించారు. - 10లో



మట్టపల్లిలో నిత్య కల్యాణం

మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు నిర్వహించారు. - 10లో

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా.. మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను మాకు పంపండి. 7వ తేదీ సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయసు పది సంవత్సరాల లోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే 6న పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం విధిగా పేర్కొనాలి.

ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నెంబర్
8978963674

దిగుబడి అంచనా..
9.61 లక్షల టన్నులు

- గత వానాకాలం కంటే తగ్గిన దిగుబడి
- ఆయకట్టుకు విడుదల కాని సాగర్ నీరు

- పడిపోయిన సాగు విస్తీర్ణం
- ధాన్య సేకరణకు ప్రణాళిక ఖరారు
- 296 కేంద్రాలు.. 4,15,559 టన్నుల ధాన్యం లక్ష్యం



వరి సాగు విస్తీర్ణం	3,46,739 ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా	9,61,046 మెట్రిక్ టన్నులు
రైతులు బయట అమ్ముకునే ధాన్యం	5,45,487 మెట్రిక్ టన్నులు
కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం	4,15,559 మెట్రిక్ టన్నులు
కేంద్రాలు:	ఐకేపీ..183 పీఏసీఎస్113

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వానాకాలం ధాన్యం సేకరణకు అధికారులు ప్రణాళిక ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా 9,61,046 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇందుకనుగుణంగా 296 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 4,15,559 టన్నుల ధాన్యం ఖరీదు చేయాలని నిర్ణయించారు. కాగా గత ఏడాది 11లక్షల మెట్రిక్ టన్నులు కాగా ఈ సారి కొంతమేర తగ్గింది. వర్షాభావం, సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయపోవడంతో వరి సాగు విస్తీర్ణం తగ్గి దిగుబడిపై ప్రభావం చూపింది.

జిల్లాలో 3,46,739 ఎకరాల వరి సాగు

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 3,46,739 ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. గత సంవత్సరం వానాకాలంలో 3,77,843 ఎకరాల్లో వరి సాగు కాగా ఈ సీజన్‌లో వర్షాభావం, సాగర్ నీరు విడుదల కాకపోవడంతో సాగుపై ప్రభావం చూపింది. గత సంవత్సరం కంటే 31,104 ఎకరాలు తక్కువగా సాగైంది. కాగా ఎకరాకు 2.80 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని, తద్వారా జిల్లాలో మొత్తం ధాన్యం దిగుబడి 9,61,046 మెట్రిక్ టన్నులు వస్తుందని వ్యవసాయ, పౌర సరఫరాలశాఖ అధికారులు అంచనా వేశారు. దీనిలో స్థానిక అవసరాలకు 78,987 మెట్రిక్ టన్నులు, విత్తనాల కోసం మరో 1500 మెట్రిక్ టన్నులు పోగా మిగిలిన 8,80,559 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నారు. దీనిలో మిల్లర్లు నేరుగా 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం ఉందని, మార్కెట్‌లో మరో 1.15 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తారని అంచనా వేశారు. మిగిలిన 4,15,559 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 296 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

296 కొనుగోలు కేంద్రాలు..

ఈ వానకాలంలో 296 కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. సహకార సంఘాల ద్వారా 113 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 183 కేంద్రాలు, మొత్తం 296 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈలోపు సిబ్బందికి కొనుగోళ్లపై శిక్షణ పూర్తి చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లు ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించి , వచ్చే ఏడాది జనవరి వరకు కొనసాగించనున్నారు.

మద్దతు ధర రూ.143 పెంపు..

గత ఏడాది గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,060 మద్దతు ఉండగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అదనంగా రూ.143 పెంచి రూ.2203 ఇవ్వాలని నిర్ణయించింది. సాధారణ రకానికి కూడా గత ఏడాది రూ.2,040 ఉండగా ఈ ఏడాది రూ.143 పెంచి రూ.2,183 ఇవ్వనుంది. ఈ సారి వరి కోతలు ముందుగానే ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు.

సంపద వనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : జిల్లాలో సంపద వనాలపై ప్రతేక శ్రద్ధ వహిచాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రజావాణితో పాల్గొన్న అధికారులతో పాటు జిల్లాలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం వెబెక్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ప్లాంటేషన్ పూర్తయిన చోట ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, ఫెన్సింగ్ ఏర్పాటు చేయని వాటి వివరాలు వెంటనే అందిచాలని సూచించారు. మొక్కలు తక్కువ ఉన్నచోట అటవీ శాఖ నుంచి తీసుకొని అన్నిచోట్లా నాటాలని కలెక్టర్ కోరారు.

నేడు కలెక్టరేట్‌లో గురు పూజోత్సవం

ఈ నెల 5న ఉదయం 8.00 గంటలకు కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది విధిగా పాల్గొనాలని ఆదేశించారు. అదే రోజు అన్ని శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మంత్రి సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. అధికారులందరు శాఖల వారీగా పూర్తి స్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక



పరికరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ ప్రియాంక

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ప్రజావాణిలో అందించిన అర్జీలను జిల్లా అధికారులు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూసమస్యలకు సంబంధించి 20, ఇతర శాఖలకు సంబంధించి 5 దరఖాస్తులు ఇలా మొత్తం 25 అందినట్లు తెలిపారు, వివిధ సమస్యలపై అందించిన అర్జీలను సత్వరమే పరిశీలన చేసి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, డీఏఓ రామారావు నాయక్, డీహెచ్ఓ శ్రీధర్ గౌడ్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీపీఓ యాదయ్య, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బోధన అభ్యసన పరికరాల ద్వారా ఆసక్తి పెంపు

బోధన అభ్యసన పరికరాలను వినియోగించి ఉపాధ్యాయులు పాఠాలు బోధించడం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని అన్ని మండలాల నుంచి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించి 20 బోధనోపకరణాలను ఎంపిక చేసి అన్ని పాఠశాలకు సరఫరా చేసేందుకు అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, క్వాలిటీ కంట్రోల్ అధికారి జనార్దన్ , ప్రధానోపాధ్యాలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 11న సూర్యాపేటలో ధర్మభిక్షం విగ్రహం వద్ద సభతో ఉత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు. భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో 4,500 మంది ప్రాణత్యాగాలు చేసి పది లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం లేదన్నారు. సమావేశంలో బొమ్మగాని శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్ పాల్గొన్నారు.

అమరవరం లిఫ్ట్‌ను యుద్ధ ప్రాతిపదికన నడపాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ దొండపాటి ఆదిరెడ్డి

హుజూర్‌నగర్ : మండలంలోని అమరవరం లిఫ్ట్‌ను అధికారులు యుద్ధప్రాతిపదికన నడిపించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ దొండపాటి ఆదిరెడ్డి కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఎంపీ ఉత్తమ్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాటాడుతూ హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల్లోని అమరవరం, అంజలిపురం, యాతవాకిళ్ల, అల్లిపురం, బక్కమంతుల గూడెం, దొనబండ తండా, పాతతండా, చౌటపల్లి, మఠంపల్లి తదితర గ్రామాల భూములకు సాగర్ నీరు అందకపోవడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి మంత్రి ఉత్తమ్ కృషితో సుమారు రూ. 50 కోట్లతో అమరవరం లిఫ్ట్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం సాగర్ నీరు రాక లిఫ్ట్ పనిచేయక రైతులు చాలా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లిఫ్ట్ నడవక పొలాలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నిజాముద్దీన్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు అశోక్, మండల అధ్యక్షుడు సింగతల వెంకటరెడ్డి , అల్లిపురం మాజీ సర్పంచ్ భోగాల పిచ్చిరెడ్డి, నాయకులు కర్నాటి వీరనాగి రెడ్డి, వుస్తెల శ్రీనివాస్ రెడ్డి, గంగసాని ఎల్లారెడ్డి, వంకట నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 7 ఫిర్యాదులు

సూర్యాపేట క్రైం: ప్రజల సౌకర్యార్థం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ఏడు ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫోన్ ద్వారా ఎస్పీ ఆదేశించారు. సమస్యను పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు.

మంత్రి పేరు చెప్పి బెదిరిస్తున్న బీఆర్‌ఎస్ నేత



సమావేశంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

- బీజేపీ నాయకుడు సంకినేని ఆరోపణ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : బీఆర్‌ఎస్ నాయకుడు కటికం శ్రీనివాస్ అనే వ్యక్తి మంత్రి జగదీష్‌రెడ్డి పేరు చెబుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కటికం శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి ముప్పిడి సుధాకర్‌రావుకు చెందిన భూమి కబ్జా చేసి 2017 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు తప్పుడు కేసులు పెడుతూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. 2011లో సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జి, 2021లో హైకోర్టు.. భూమి సుధాకర్‌రావుది అని తీర్పులిచ్చాయని, ఈ తీర్పులను లెక్కచేయకుండా మంత్రి పేరు చెప్పి పోలీసుల సహాయంతో సుధాకర్ భూమిలోకి అక్రమంగా చొరబడి కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరిస్తున్నారన్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు భూమిలో ఏ పంట వేసినా నాశనం చేస్తున్నాడని దీంతో సుమారు రూ.20 లక్షల నష్టం కలిగించాడని ఆరోపించారు. భూకబ్జాదారులకు మంత్రి అండగా ఉంటూనే నీతులు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో మన్మథరెడ్డి, చలమల్ల నరసింహ, ధనుంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంజీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం ఎంజీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు పెన్‌డౌన్, చాక్ డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకుల మాదిరిగానే యూనివర్సిటీలోని కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు శ్రీధర్, ఆంజనేయులు, శివశంకర్, రవీందర్‌రెడ్డి, పాండరయ్య, అమరేందర్, శంకరాచారి, మౌనిక తదితరులు పాల్గొన్నారు

వీఓఏల వేతనం పెంపు

- రూ.5,900 నుంచి రూ.8వేలకు పెరుగుదల
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 579 మందికి లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న వీఓఏలు



తాటిపాములలో సంఘం లావాదేవీలు నిర్వహిస్తున్న వీఓఏలు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో కీలకంగా పనిచేస్తున్న వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ల గౌరవ వేతనం పెరిగింది. రూ.5,900 నుంచి రూ.8వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై వీఓఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 17,726 స్వశక్తి సంఘాల్లో 1,82,371 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఆయా సంఘాల్లోని మహిళా సభ్యులకు జిల్లాలో ఏటా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రూ.1000 కోట్ల రుణాలను అందిస్తున్నారు. అంతే కాకుండా వివిధ పథకాల ద్వారా ప్రత్యేక రుణాలు అందిస్తుండటంతో ఆయా సంఘాల లావాదేవీల్లో ఎప్పటికప్పుడు సెర్ప్ సిబ్బందితో పాటు 579 వీఓఏలు కీలకంగా ఉంటున్నారు. ప్రతి నెల రెండుసార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడమే కాకుండా సంఘంలో చర్చించిన అంశాలు, పాల్గొన్న సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా సంఘాలకు ఒక్కొక్క వీఓఏ పని చేస్తున్నారు. ఇప్పటి వరకు వారికి రూ.2 వేలు సంఘాల ద్వారా, ప్రభుత్వం నుంచి రూ.3900 అందుతున్నాయి. ప్రస్తుతం సంఘాల నుంచి రూ.3000 చెల్లించాలని, ప్రభుత్వం రూ.5000 గౌరవ వేతనం ఇవ్వనుంది. దీంతో వారికి నెలకు వేతనం రూ.8 వేలు అందనున్నాయి.

డ్రెస్ కోడ్‌కు ప్రత్యేక నిధులు

వీఓఏల డ్రెస్ కోడ్‌కు ప్రత్యేకంగా నిధులు అందించడమే కాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి రెన్యువల్ పద్ధతి మార్చుతూ ఏడాదికి ఒకసారి సవరించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలులో వీఓఏలు క్షేత్ర స్థాయిలో కృషి చేస్తున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనం వల్ల ఆర్థికంగా భరోసా ఏర్పడింది. ప్రతి నెల వేతనాలు పొందే అవకాశం ఉంది. వీఓఏలకు బీమా సౌకర్యం కల్పించాలి.
– సంధ్య, వీఓఏ, తిరుమలగిరి

ఉత్తమ ఉపాధ్యాయులు 115 మంది

- నేడు మంత్రి చేతుల మీదుగా అవార్డుల అందజేత

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 115 మందిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు డీఈఓ అశోక్ తెలిపారు. మొత్తం 115 మంది దరఖాస్తు చేసుకోగా వారి పేర్లను పరిశీలించి అందరినీ ఎంపిక చేశామన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయం 9.30గంటల వరకు హాజరు కావాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



జీహెచ్‌ఎంలు

సైదా	సోమవరం జెడ్పీహెచ్‌ఎస్, నూతనకల్
ధారాసింగ్	కోటపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూర్.ఎస్
డి.శివయ్య	చినసెమిల జెడ్పీహెచ్‌ఎస్, మద్దిరాల
అబ్దుల్ లతీఫ్	హుజూర్‌నగర్ జెడ్పీజీఎస్, హుజూర్‌నగర్
కె.కనకయ్య	రాయినిగూడెం జెడ్పీహెచ్‌ఎస్, గరిడేపల్లి
సుజాత	జెడ్పీహెచ్‌ఎస్, శాంతినగర్, అనంతగిరి
వి.బాలరాజ్	టీఎస్‌ఎంఎస్ అనంతారం, తిరుమలగిరి

స్కూల్ అసిస్టెంట్లు

సాదు బ్రహ్మానందం	రామాపురం జెడ్పీహెచ్‌ఎస్,నడిగూడెం
ఎన్.పుష్పకుమారి	నూతనకల్ జెడ్పీహెచ్‌ఎస్
పి.ప్రసాద్	కొండాపురం జెడ్పీహెచ్‌ఎస్, చిలుకూరు
కె.వెంకటేశ్వర్లు	గణపవరం జెడ్పీహెచ్‌ఎస్, కోదాడ
కేవి సత్యనారాయణ	వెల్దండ జెడ్పీహెచ్‌ఎస్, గరిడేపల్లి
ఎం.శ్రీను	సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్, మోతె
ఎస్.హేమమాలిని	ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్, నాగారం
ఎన్.శ్రీరంగరాజు	రత్నవరం జెడ్పీహెచ్‌ఎస్, నడిగూడెం
బి.కనకమ్మ	నడిగూడెం జెడ్పీహెచ్‌ఎస్
షేక్ అబ్దుల్ అజీజ్	వల్లభాపురం జెడ్పీహెచ్‌ఎస్, నడిగూడెం
ఎన్.వెంకటేశ్వర్లు	రాయినిగూడెం జెడ్పీహెచ్‌ఎస్,గరిడేపల్లి
వి.పద్మలీల	టేకుమట్ల జెడ్పీహెచ్‌ఎస్, సూర్యాపేట
ఎ.రమేష్	సూర్యాపేట నెం.2 హైస్కూల్
బి.జయమణి	బాలెంల జెడ్పీహెచ్‌ఎస్, సూర్యాపేట
కొండరామయ్య	రఘునాథపాలెం జెడ్పీహెచ్‌ఎస్, మఠంపల్లి
ఎంఏ గఫార్	అనంతగిరి జెడ్పీహెచ్‌ఎస్
జి.అరుంధతి	టేకుమట్ల జెడ్పీహెచ్‌ఎస్, సూర్యాపేట
కె.ఉపేంద్ర	జెడ్పీహెచ్‌ఎస్ తిరుమలగిరి
ఆర్.శైలజ	నడిగూడెం జెడ్పీహెచ్‌ఎస్
ఎం.ఉపేందర్	గోండ్రియాల జెడ్పీహెచ్‌ఎస్, అనంతగిరి
ఎస్.వెంకన్న	వెంకేపల్లి కేజీఆర్‌ఆర్‌ఎం జెడ్పీహెచ్‌ఎస్, నూతనకల్
ఆర్.శ్రీదేవి	చింతలపాలెం జెడ్పీహెచ్‌ఎస్
వై.వెంకటేశ్వర్లు	పొనుగోడు జెడ్పీహెచ్‌ఎస్, గరిడేపల్లి
ఎస్.రామలింగేశ్వరి	ఎంపీయూపీఎస్ గుడిమల్కాపురం, చింతలపాలెం
ఎస్‌కె.జాఫర్	మునగాల జెడ్పీహెచ్‌ఎస్
జి.అశోక్‌రెడ్డి	తిరుమలగిరి.జి జెడ్పీహెచ్‌ఎస్, చివ్వెంల
పి.నళిని	గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్, గరిడేపల్లి
ఎం.కొండయ్య	చింతకుంట జెడ్పీహెచ్‌ఎస్, నేరేడుచర్ల
పి.ఝాన్సీ	ఏనుభాముల జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూర్.ఎస్
వి.శ్రీరాంరెడ్డి	జాన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్, పాలకవీడు
వి.రామకృష్ణ	మఠంపల్లి జెడ్పీహెచ్‌ఎస్
ఎస్‌హెచ్.షాబుద్దీన్	వెంకేపల్లి కేజీఆర్‌ఆర్‌ఎం, నూతనకల్
పి.వీరబాబు	గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్, గరిడేపల్లి
కె.వెంకటేశ్వర్లు	వాయిలసింగారం, జెడ్పీహెచ్‌ఎస్, అనంతగిరి
ఆర్.వెంకటయ్య	తిరుమలగిరి.జి జెడ్పీహెచ్‌ఎస్, చివ్వెంల
ఆర్.విజయ్	కుసుమారిగూడెం ఎంపీయూపీఎస్, సూర్యాపేట
బి.సత్యనారాయణ	ఇస్తాళాపురం జెడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూర్.ఎస్
డి.చాంప్లా	తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్, జాజిరెడ్డిగూడెం
సత్యవతి	ప్రభుత్వ ఉన్నత పాఠశాల సూర్యాపేట

ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు

ఎస్.సుధాకర్	జాజిరెడ్డిగూడెం ఎంపీపీఎస్
ఆర్.శ్రీదేవి	తుంగతుర్తి ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ
డి.అంజలి(ఎల్‌పీహెచ్)	పోలుమళ్ల జెడ్పీహెచ్‌ఎస్ మద్దిరాల
ఎండీ.జానిబేగం (ఎల్‌పీహెచ్)	శ్రీనివాసపురం ఎంపీయూపీఎస్, హుజూర్‌నగర్
ఎస్.అవిలేను (ఎల్‌పీటీ)	డి.కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్, నాగారం
జి.దుర్గాప్రసాద్ (ఎల్‌పీటీ)	తిరుమలగిరి జెడ్పీహెచ్‌ఎస్
ఎం.రేణుక(పీడీ)	హుజూర్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్
జి.ఏడుకొండల్(పీఈటీ)	అనంతగిరి జెడ్పీహెచ్‌ఎస్
ఎస్‌కె.ఉస్మాన్(పీఈటీ)	రామాపురం జెడ్పీహెచ్‌ఎస్, మేళ్లచెరువు
ఎం.సీతారాంరెడ్డి (పీఈటీ)	మఠంపల్లి జెడ్పీహెచ్‌ఎస్

పీజీటీలు

జె.ప్రసన్నకుమారి	టీఎస్‌ఎంఎస్, మునగాల
కె.లింగయ్య	టీఎస్‌ఎంఎస్ ఇమాంపేట, సూర్యాపేట
సీహెచ్.శ్రీనివాస్	టీఎస్‌ఎంఎస్, ఆత్మకూర్.ఎస్
వి.అంబేద్కర్	టీఎస్‌ఎంఎస్, మునగాల
ఎస్‌కె.షరీఫ్	టీఎస్‌ఎంఎస్ కర్విరాల, నడిగూడెం
ఎం.జానయ్య	టీఎస్‌ఎంఎస్ అనంతారం, తిరుమలగిరి
బి.సైదులుగౌడ్	టీఎస్‌ఎంఎస్ అనాజిపురం, పెన్‌పహాడ్
పి.శ్రీనివాస్	టీఎస్‌ఎంఎస్ పసునూరు, నాగారం
డి.రవికుమార్	టీఎస్‌ఎంఎస్ గడ్డిపల్లి , గరిడేపల్లి

ఎస్‌జీటీలు

ఎన్.నిర్మల	ఎంపీపీఎస్, చివ్వెంల
కె.వీరేంద్ర	ఎంపీపీఎస్, పెన్‌పహాడ్
ఎం.రవీందర్	ఎంపీపీఎస్ వెంపటి, తుంగతుర్తి
ఎ.బ్రహ్మాచారి	ఎంపీపీఎస్ పెదసీతారంతండా, పెన్‌పహాడ్
బి.సైదమ్మ	ఎంపీపీఎస్ తెల్లబండతండా, అనంతగిరి
బి.శ్రీనివాస్	ఎంపీపీఎస్ తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం
కె.కిరీటం	ఎంపీపీఎస్ మచ్చవరం, హుజూర్‌నగర్
కె.సైదులు	ఎంపీపీఎస్ గడ్డిపల్లి, గరిడేపల్లి
ఎం.వెంకటరమణ	ఎంపీపీఎస్ గోపాలపురం, హుజూర్‌నగర్
ఎన్.కల్పన	ఎంపీపీఎస్ మాధవరం, మునగాల
బి.వెంకట్రాంరెడ్డి	ఎంపీపీఎస్ యాతవాకిళ్ల ఎస్సీకాలనీ, మఠంపల్లి
ఆర్.కృష్ణయ్య	ఎంపీపీఎస్ అన్నారం(ఎన్) ఎస్సీ కాలనీ, పెన్‌పహాడ్
పి.కవిత	ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ, వల్లాపురం, నడిగూడెం
బి.సైదులు	ఎంపీపీఎస్ రామలక్ష్మీపురం, కోదాడ
బి.నాగేశ్వర్‌రావు	ఎంపీపీఎస్ మాచవరం,హుజూర్‌నగర్
కె.ఉపేందర్	ఎంపీయూపీఎస్ హేమ్లాతండా, మేళ్లచెర్వు
కె.బాలకృష్ణ	ఎంపీపీఎస్ అలింగాపురం, పాలకవీడు
బి.సైదులు	ఎంపీపీఎస్ సోమవరం, నేరేడుచర్ల
కె.శ్రీను	ఎంపీ యూపీఎస్ కిష్టాపురం, చింతలపాలెం
కె.మాధవి	ఎంపీపీఎస్ చిర్మించర్ల, నేరేడుచర్ల
ఇ.సుధాకర్‌రెడ్డి	ఎంపీపీఎస్ ఏపూర్, ఆత్మకూర్‌ఎస్
జి.ఉపేందర్	ఎంపీపీఎస్ బాపనిబావితండా, తుంగతుర్తి
సీహెచ్.వెంకటేశ్వర్లు	ఎంపీపీఎస్ జాజిరెడ్డిగూడెం
కె.రమేష్	ఎంపీపీఎస్ దుబ్బతండా, తిరుమలగిరి
సత్యనారాయణ	ఎంపీపీఎస్ గుర్రంబోడు , మఠంపల్లి
ఎ.రాములు	ఎంపీపీఎస్ కలకోవ, మునగాల
జి.శ్రీనివాస్	ఎంపీపీఎస్ గోవిందాపురం, హుజూర్‌నగర్
ఎం.నాగన్న	ఎంపీయూపీఎస్ చిల్పకుంట్ల, నూతనకల్
ఎ.చంద్రశేఖర్	ఎంపీపీఎస్ చినసీతారాంతండా, పెన్‌పహాడ్
ఎం.జగన్‌మోహన్	ఎంపీపీఎస్ చిలుకూరు
పి.విజయలక్ష్మి	ఎంపీపీఎస్ కుంటపల్లి, మద్దిరాల
పి.వీరబాబు	ఎంపీపీఎస్ విభలాపురం, మోతె
కె.పురుషోత్తమరావు	ఎంపీపీఎస్ అమరవరం, హుజూర్‌నగర్
బి.వీరన్న	ఎంపీపీఎస్ కందిబండ, మేళ్లచెర్వు
పి.నగ్య	ఎంపీపీఎస్ వేణుగోపాలపురం, నడిగూడెం
ఎన్.పరమేష్	ఎంపీపీఎస్ కర్విరాల, తుంగతుర్తి
సీహెచ్.కృష్ణయ్య	ఎంపీపీఎస్ ఎల్‌బీనగర్, గరిడేపల్లి
పి.రమేష్‌కుమార్	ఎంపీయూపీఎస్ వెల్లటూర్, చింతలపాలెం
పుతిలి	ఎంపీపీఎస్ ఎన్‌ఎస్‌పీ క్యాంపు, హుజూర్‌నగర్
ఎ.రాజశేఖర్‌రెడ్డి	ఎంపీపీఎస్ కనకదుర్గస్ట్రీట్, హుజూర్‌నగర్
ఎం.విజయలక్ష్మి	ఎంపీపీఎస్ గుమ్మడవెల్లి, మద్దిరాల
జి.యల్లయ్య	ఎంపీపీఎస్ వర్ధమానుకోట, నాగారం
ఆర్.నాగరాజు	ఎంపీపీఎస్ ఏనెకుంటతండా, తుంగతుర్తి
జి.సైదా	ఎంపీపీఎస్ పరెడ్డిగూడెం,గరిడేపల్లి
ఆర్.ప్రతాప్	ఎంపీపీఎస్ కేటీ అన్నారం, సూర్యాపేట
వి.వరప్రసాద్	ఎంపీపీఎస్ గుండెబోయినగూడెం, పాలకవీడు
వి.నర్సింహారావు	ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ దొండపాడు, చింతలపాలెం
డి.మణికుమారి	ఎంపీపీఎస్ చింతలపాలెం
వి.విజయకుమారి (ఎస్ఓ)	కేజీబీవీ మఠంపల్లి
ఎన్.రామలింగాచారి, టీజీటీ(టి)	టీఎస్‌ఎంఎస్ గడ్డిపల్లి, గరిడేపల్లి

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. నిత్య కైంకర్యాలు చేపట్టిన అనంతరం నిత్య రుద్రహవనం గావించారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు చేశారు. శివపార్వతుల కల్యాణ వేడుక, సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయంలోనూ స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయపూజలు కొనసాగాయి.



క్లుప్తంగా

దైవ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా

● పలువురికి గాయాలు



గాయపడిన వారిని ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

హుజూర్‌నగర్: దైవ దర్శనానికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం హుజూర్‌నగర్ పట్టణ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పలువురు భక్తులు ఆటోలో సోమవారం కోదాడ మండలంలోని ఎర్రవరం ఉగ్ర బాలనర్సింహస్వామి ఆలయానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హుజూర్‌నగర్ పట్టణ శివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కటారి వీరాంజనేయులు, కటారి లక్ష్మి, నారబోయిన కోటిరత్నంకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో గాయపడిన వారిని హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించుకొని వారు నరసరావుపేటకు వెళ్లిపోయారు.

చోరీ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నూతనకల్: చోరీ కేసులో ఓ వ్యక్తికి తుంగతుర్తి మున్సిఫ్ మెజిస్ట్రేట్ శాలిని ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం వెంకెపల్లి గ్రామంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఇటీవల హుండీ చోరీ చేసిన కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రహ్మకన్నపల్లెకు చెందిన కొమరగిరి యాకూబ్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారించగా.. అతడు నేరాన్ని అంగీకరించడంతో కేసు నమోదు చేశారు. యాకూబ్‌ను సోమవారం తుంగతుర్తి కోర్టులో హాజరుపర్చగా వివిధ సాక్ష్యాలను పరిశీలించిన మున్సిఫ్ మెజిస్ట్రేట్ శాలిని అతడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధికి కేరాఫ్ బీఆర్‌ఎస్ సర్కార్



చిన్న మూసీపై బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: బీఆర్‌ఎస్ సర్కార్ అంటేనే అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లిలో చిన్నమూసీపై రూ.4.50 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జి, రూ.12.60 లక్షలతో నిర్మించిన వైకుంఠ ధామాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అలాగే దుర్గాదేవి కళావేదికకు శంకుస్థాపన చేశారు. అనంతరం కనుముకుల గ్రామంలో వైకుంఠధామం ప్రహరీ, కళావేదిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి సూచీలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించాలని కోరారు. పిలాయిపల్లి – దేశ్‌ముఖి, రేవనపల్లి – పెద్దరావులపల్లి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు పిలాయిపల్లిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాద్గుల ప్రభాకర్ రెడ్డి, జెడ్పీటీసీ కోట పుష్పలతమల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, ఎంపీడీఓ బాలశంకర్, పీఆర్ ఏఈ వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ కె.భూపాల్‌రెడ్డి, సర్పంచుల, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, బత్తుల మాధవిశ్రీశైలంగౌడ్, సర్పంచులు కంటె రాములుయాదవ్, కోట అంజిరెడ్డి, యాకరి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులు

● బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి
● విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



గ్లోబల్ టీచర్ అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు తూడి వెంకట్‌రెడ్డి (ఫైల్)



తూడి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తూడి వెంకట్‌రెడ్డి ఎక్కడ పనిచేసినా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. 2015లో బదిలీపై ఆయన అప్పటికే మూతబడ్డ త్రిపురారం మండలంలోని బాబుసాయిపేట ఎంపీయూపీఎస్ పాఠశాలకు వచ్చారు. ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించి ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి 8 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 80 మందికి పెంచారు. ఆయన ప్రత్యేక చొరవ వల్ల ఆ పాఠశాల ఆదర్శ పాఠశాలగా నిలిచింది. గ్రామపంచాయతీ సహకారంతో ఒక విద్యా వలంటీర్‌ను, ఒక స్కావెంజర్‌ను ఏర్పాటు చేసుకొని ఇంటింటికి తిరిగి బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషిచేశారు. ఇప్పుడు ఆ పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో మండల స్థాయిలోనే అత్యుత్తమ మార్కులు సాధించడంతో గురుకుల సీట్లు కూడా సాధించారు. గతంలో ఆయన వేములపల్లి మండలం శెట్టిపాలెంలో పనిచేసినప్పుడు 65 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 108 మంది విద్యార్థులకు పెంచారు. దీంతో ఆ పాఠశాలకు రెండు అదనపు ఉపాధ్యాయుల పోస్టులు, ఒక ఎల్‌ఎఫ్‌ఎల్, హెచ్‌ఎం, ఎస్‌జీటీ పోస్టు మంజూరైంది. అంతకుముందు నిడమనూరు మండలం కుంటిగొర్లగూడెంలో ఐదున్నర సంవత్సరాలు పనిచేశారు. అక్కడ భవనం లేకపోయినప్పటికీ చెట్ల కిందనే విద్యార్థులకు విద్యా బోధన చేసి ఉత్తమ పాఠశాలగా తీర్చిదిద్దారు. అదేవిధంగా బాబుసాయిపేట పాఠశాలలో హరితహారం, పచ్చదనం, పరిశుభ్రతపై దృష్టి సారించారు. గ్రామపంచాయతీ సహకారంతో 50 ట్రక్కుల నల్లరేగడి మట్టిని పోయించి 200 మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ప్రతి శనివారం విద్యార్థులతో కలిసి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచి పచ్చదనంగా ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులకు బోధన సులభతరం చేయడం కోసం సొంత ఖర్చులు రూ.30వేలతో గోడలపై బొమ్మలను గీయించారు. సొంత ఖర్చులతో విద్యార్థులకు టై, బెల్టులు అందించారు. సామాజిక సేవ, యోగా, వ్యక్తిత్వ వికాసం, దేశ భక్తి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో వెంకట్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆటా టీచర్స్ అవార్డు, జాతీయ విద్యారత్న అవార్డు, జాతీయ పుడమి అవార్డు, తెలంగాణ ప్రతిభరత్న అవార్డు, మదర్ థెరిస్సా ఉత్తమ సేవా పురస్కారం, గతేడాది గ్లోబల్ టీచర్ అవార్డు అందుకున్నారు.

'డిజిటల్' టీచర్



వెలిదండ జెడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు కేవీ సత్యనారాయణ



సత్యనారాయణ

గరిడేపల్లి: మండలంలోని వెలిదండ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేవీ సత్యనారాయణ తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తకాల రచయితగా, ఉత్తమ ఉపాధ్యాయుడిగా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. గత 28 ఏళ్లుగా గరిడేపల్లి మండలంలోని గారకుంటతండా, రేగులగడ్డతండా, కీతవారిగూడెం, వెలిదండ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తూ పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేసి ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతానికి పాటుపడుతున్నారు. వెలిదండ పాఠశాలలో దాతల సహకారంతో డిజిటల్ తరగతి గదితో పాటు అత్యాధునిక గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయించారు. 5000 గజాల స్థలాన్ని దాతల ద్వారా సమకూర్చారు. ఆయన సహకారంతో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రస్తుతం ప్రసిద్ధ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించి ఉన్నత లక్ష్యాల వైపు పురోగమిస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడుతూ..



పాఠాలు చెబుతున్న ప్రధానోపాధ్యాయురాలు సుజాత

నడిగూడెం: విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది తగ్గుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయి. ఇలాంటి సమయంలో నడిగూడెం మండలంలోని సిరిపురం కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కన్నెగంటి సుజాత గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో నిత్యం చర్చించి విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్నారు. సిరిపురం కాలనీ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 67 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో ఓ వైపు విద్యార్థుల సంఖ్య పెంచుతూ, మరోవైపు విద్యార్థులకు దాతల సహకారంతో నోట్‌పుస్తకాలు, దుస్తులు, ఆట వస్తువులు ఇప్పిస్తూ పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

బొమ్మలతో తెలుగు భాష అర్థమయ్యేలా..



బొమ్మలు గీసి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు దామోదరాచారి

నాంపల్లి: నాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు దామోదరాచారి తనదైన శైలిలో తెలుగు సబ్జెక్ట్‌ను విద్యార్థులకు బోధిస్తున్నారు. పాఠ్యాంశాన్ని బోధించే ముందు దామోదరాచారి అందుకు సంబంధించిన బొమ్మలను బోర్డుపై ఆకర్షణీయంగా గీస్తారు. పాఠాలు వినడంతో పాటు అందుకు సంబంధించిన బొమ్మలను చూడడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశం సులభంగా అర్థమవుతుందనే ఆలోచనతో బోధిదిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు సమాజంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ స్ఫూర్తిని నింపుతున్నారు. దామోదరాచారి గతేడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు.

కరోనా సమయంలోనూ కొత్తగా బోధన



కరోనా సమయంలో గోడలపై రాయించి బోధిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మ (ఫైల్)

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన అలుగుబెల్లి పద్మ త్రిపురారం మండలంలోని కంపాసాగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పుడమి సాహితీ వేదిక వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారం –2023కు ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాలలోని విద్యార్థులకు ఆయా సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులతో కలిసి విద్యా బోధన చేస్తున్నారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ గ్రామస్తులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించారు. కరోనా కష్టకాలంలో సైతం విద్యార్థులు చదువులో వెనుకబడకుండా వినూత్నంగా ఆలోచించి గ్రామంలోని వాటర్ ట్యాంకులు, పహరీలపై ఇంగ్లిష్ అక్షరాలు, పదాలను బొమ్మల రూపంలో రాయించి బోధించారు. దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడానికి కృషిచేస్తున్నారు. దీంతో గ్రామస్తులు వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపాలనే ఆలోచన చేయకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగిస్తూ విద్యా బోధన చేస్తున్నామని ప్రధానోపాధ్యాయురాలు అలుగుబెల్లి పద్మ పేర్కొన్నారు.

వినూత్న రీతిలో బోధన



వివిధ పరికరాలతో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు బి. రాజేశ్వరీ



బి. రాజేశ్వరీ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని భీమనపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు బి. రాజేశ్వరీ వినూత్న పద్ధతిలో బోధన చేస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటోంది. పాఠశాలలో గత 12 ఏళ్లుగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే విధంగా టాపిక్‌లను అనుగుణంగా స్వయంగా బోధనాభ్యాసన పరికరాలను తయారు చేసి కథల రూపంలో బోధిస్తున్నారు. అవసరాన్ని బట్టి టీవీతో పాటు మొబైల్‌లో లైవ్ వీడియోలను ప్రదర్శిస్తూ పాఠాల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంపొందిస్తున్నారు. పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలే కాకుండా నైతిక విలువల గురించి బోధిస్తున్నారు. ఖాళీ సమయాల్లో పిల్లల్లో జ్ఞాపకశక్తిని పెంపొందించేందుకు యోగా, ధ్యానం నేర్పిస్తున్నారు. అంతేకాక చదువులో పోటీతత్వం పెంచేలా పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సొంతంగా పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు, డిక్షనరీలు, బుక్స్ అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపుతూ..



కొండ్రాపల్లి జనార్దన్



వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కొండ్రాపల్లి జనార్దన్ (ఫైల్)

నాంపల్లి: విద్యార్థుల భవిష్యత్‌కు దారి చూపుతూ ఉపాధ్యాయ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేస్తున్నారు మర్రిగూడ మండలంలోని శివన్నగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండ్రాపల్లి జనార్దన్. ఆయన పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేశారు. దాతలు సహకారంతో, ప్రభుత్వం నిధులతో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించారు. విద్యార్థులకు ఆటపాటలతో పాఠ్యంశాలు అర్థమయ్యేలా బోధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఎందరో పేద విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికను తయారుచేసి గురుకుల, నవోదయ, ఆదర్శ పాఠశాలలకు ఆయన కృషిచేశారు. దాతలను సహకారంతో బెంచీలు, సైన్స్ పరికరాలు, చార్టులు, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేశారు. ఆయన సేవలను గుర్తించి 1994లో కల్చరల్ టాలెంట్ జాతీయ కోచ్‌గా ఎంపిక చేశారు. 2004లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకున్నారు. 2017లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అప్పటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.

జంకుతండాలో భూమి పంచాయితీ



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు



అధికారులు, పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జంకుతండా గ్రామస్తులు

● గ్రామ పంచాయతీ భూమిలో పంచాయతీ భవన నిర్మాణానికి పూనుకున్న అధికారులు
● ముగ్గు పోస్తుండగా అడ్డుకున్న మహిళ
● ఆ స్థలం తమదేనంటూ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం జంకుతండాలో గ్రామపంచాయతీకి చెందిన భూమిలో పంచాయతీ భవనం నిర్మించేందుకు గాను సోమవారం ముగ్గు పోసేందుకు వెళ్లిన అధికారులను ఓ మహిళ అడ్డుకుంది. ఆ భూమి తమదేనని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు.. నూతన గ్రామపంచాయతీగా ఏర్పడిన జంకుతండాలో పంచాయతీ భవనం నిర్మించేందుకు గ్రామ కంఠం భూమి లేకపోవడంతో సర్వే నంబర్ 45/2/1/2లో రెండున్నర గుంటలు, 45/2/3లో మరో రెండున్నర గుంటలు మొత్తం కలిపి ఐదు గుంటల భూమి గ్రామపంచాయతీ పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యి ఉండడంతో అందులో ముగ్గు పోసేందుకు సోమవారం అధికారులు వచ్చారు. జేసీబీతో అధికారులు ఆ స్థలాన్ని శుభ్రం చేయిస్తుండగా.. అదే గ్రామానికి చెందిన బాలాజీ, అతడి భార్య సరోజ ఆ స్థలం తమది అంటూ అధికారులను అడ్డుకున్నారు. తాము ఎన్నో సంవత్సరాలుగా ఆ స్థలంలో పెంట పోసుకుంటున్నామని, అధికార పార్టీ సర్పంచ్ ప్రోద్బలంతోనే ఈ భవన నిర్మాణం జరుగుతుందని ఆరోపించారు. ఆధారాలు చూపించాలని అధికారులు కోరడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ముగ్గు పోయడం ఆపకపోతే తాను చనిపోతానంటూ సరోజ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సమయంలో గ్రామానికి చెందిన మరికొంత మంది అక్కడకు చేరుకొని ఆందోళనకు దిగారు. ముగ్గు పోసేందుకు వచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. సరోజను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయంపై తహసీల్దార్ హరిబాబును వివరణ కోరగా.. జంకుతండాలో పంచాయతీ భవనం నిర్మాణానికి గ్రామ కంఠం భూమి లేదని, దీంతో గ్రామ పంచాయతీకి ఇద్దరు దాతలు విరాళంగా ఇచ్చిన ఐదు గుంటల భూమిని సర్వే చేయించి అందులో భవనం నిర్మాణానికి ముగ్గు పోసినట్లు తెలిపారు. ఆందోళన చేసేవారిని ఆధారాలు చూపించమని అడిగితే వారి నుంచి ఎలాంటి సమాధానం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఆర్డీఓ, కలెక్టర్‌కు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. జంకుతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కొంతమందిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపారు. ఘటనా స్థలం వద్ద మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, తహసీల్దార్ హరిబాబు, డివిజనల్ సర్వేయర్ బాలాజీ, పీఆర్ ఏఈ చిల్లంచర్ల ఆదినారాయణ, మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు, ఆర్‌ఐ శ్యాం తదితరులున్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

● రాజాపేట పీఏసీఎస్ వద్ద వర్షంలో నిరీక్షణ
● రెండు, మూడు బస్తాలతో సరిపెట్టిన అధికారులు



వర్షంలో యూరియా కోసం గుమిగూడిన రైతులు

రాజాపేట: యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు ఎరువుల షాపులు, పీఏసీఎస్ కార్యాలయాల చుట్టూ తిరిగిపోతున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియా కొన్ని గంటల్లోనే అయిపతుంది. సోమవారం రాజాపేట మండల కేంద్రంలోని రేణికుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి లారీ లోడ్ యూరియా వచ్చింది. సమాచారం అందుకున్న రైతులు పీఏసీఎస్‌కు తరలివచ్చారు. వర్షంలో తడుస్తూ యూరియా తీసుకెళ్లారు. ఎరువుల డీలర్ల వద్ద యూరియా దొరకడం లేదని, పీఏసీఎస్ కేంద్రాల వద్ద కూడా ఎదురుచూడాల్సి వస్తుందని రైతులు వాపోయారు.

ఇంకా 20 వేల బస్తాల యూరియా అవసరం..

పీఏసీఎస్‌కు సోమవారం 8వేల బస్తాల యూరియా రాగా రూ.270 చొప్పున ఒక్కో రైతుకు రెండు నుంచి మూడు బస్తాలు విక్రయించారు. మండలంలో ఇంకా 20 వేల బస్తాల వరకు యూరియా అవసరం ఉందని పీఏసీఎస్ సీఈఓ శేఖర్ తెలిపారు.

ఓరుగంటి రాములు మృతి బీజేపీకి తీరని లోటు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
● రాములు భౌతికకాయానికి నివాళులర్పించిన పలువురు నేతలు



బీజేపీ కార్యాలయంలో రాములు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఓరుగంటి రాములు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: బీజేపీ సీనియర్ నాయకుడు ఓరుగంటి రాములు మృతి పార్టీకి తీరని లోటని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వ్యక్తి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఓరుగంటి రాములు పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాములుతో తనకు 40 ఏళ్ల నుంచి సన్నిహితం ఉందన్నారు. రాములు రోడ్డు ప్రమాదంలో మరణించడం తనను కలిచివేసిందన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి రామగిరిలోని ఓరుగంటి రాములు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఓరుగంటి రాములు వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదే విధంగా మాజీమంత్రి కుందూరు జానారెడ్డి బీజేపీ కార్యాలయానికి వచ్చి రాములు భౌతికకాయానికి నివాళులర్పించారు. తాను, ఓరుగంటి రాములు జనసంఘ్‌లో కలిసి పనిచేశామని గుర్తుచేశారు. అదే విధంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి.. రాములుకు నివాళులర్పించారు. వీరితో పాటు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి, చింత సాంబమూర్తి, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బంగారు శృతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పోతెపాక సాంబయ్య, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ముగిసిన అంత్యక్రియలు

ఓరుగంటి రాములు అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. ఆయన కుమార్తె అమెరికా నుంచి రావడంతో సోమవారం దుప్పలపల్లి రోడ్డులోని ఓరుగంటి రాములు వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి



రాములు మృతదేహంపై బీజేపీ జెండా కప్పుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి తదితరులు



ఓరుగంటి రాములు పాడె మోస్తున్న నల్లు ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

కోర్టు ధిక్కరణ కేసులో ఎస్‌ఐకి జైలు శిక్ష

వేములపల్లి: హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన వేములపల్లి ఎస్‌ఐ దాచేపల్లి విజయ్‌కుమార్‌కి మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలు.. కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు దాసరి యాదగిరి, దాసరి శ్రీనివాసులుకు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 902లో 2.12 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి సంబంధించి ఆ అన్నదమ్ములిద్దరికి ఇతరులతో గొడవలు జరుగుతుండడంతో వారు గతంలో హైకోర్టును ఆదేశించారు. దీంతో హైకోర్టు అట్టి భూవివాదంలో పోలీసులు కాని, ఇతరులెవ్వరూ జోక్యం చేసుకోవద్దని అప్పట్లో ఆదేశాలు జారీ చేసింది. ఆ సమయంలో కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో హౌస్ ఆఫీసర్‌గా పనిచేసిన దాచేపల్లి విజయ్‌కుమార్ హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. దాసరి యాదగిరి, దాసరి శ్రీనివాసులును ఇబ్బందులకు గురిచేస్తున్న వారితో చేతులు కలిపి తిరిగి యాదగిరి, శ్రీనివాస్ పైనే కేసులు నమోదు చేశాడు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు ధిక్కరణ కింద ప్రస్తుతం వేములపల్లి ఎస్‌ఐగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు రెండు నెలల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆ వెంటనే తీర్పు అమలును నాలుగు వారాలకు వాయిదా వేసింది.